క్లుప్తంగా

పకడ్బందీగా రేషన్ సరకులు పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కంచిలి: ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా రేషన్ సరకులు పంపిణీ చేపట్టాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ డీలర్లకు సూచించారు. తన కార్యాలయంలో మండల డీలర్లతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగులకు డోర్ డెలివరీ చేయడానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. అందుకు తగ్గట్టుగా డీలర్లంతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినికి డీఈవో అభినందన



విద్యార్థిని కీర్తనతో డీఈవో తిరుమల చైతన్య, ఉపాధ్యాయ సిబ్బంది

మందస: కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పైల కీర్తన ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. దీంతో పాఠశాలను మంగళవారం సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య కీర్తనతో పాటు ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కె.వేణుగోపాలరావు, సిబ్బంది గణేశ్వరరావు, భీమారావు, లక్ష్మణరావు, అప్పారావు, జానకమ్మ, దామోదర్, గోపాలకృష్ణ, రమేష్ ఉన్నారు.

కేసుపురంలో 'పొలం పిలుస్తోంది'



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: పంటల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అజయ్‌కుమార్ అన్నారు. కేసుపురం, ఇన్నేసుపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తనాల శుద్ధి గురించి వివరించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన ప్రదర్శనలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు కోరారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్, ఆఫీస్ వర్క్, తాగునీటి విభాగానికి చెందిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ వితరణ



పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడుపేట గ్రామంలోని గల్ఫ్ యూత్ ప్రతినిధులంతా కలిసి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు వాటర్ ప్యూరిఫైయర్లను వితరణ చేశారు. వీటిని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కంబాల శివాజీ, హెచ్ఎం లఖినాన కరుణాకర్, గల్ఫ్ యూత్ సభ్యులు బడే శివ, అంబటి రవి, కె.భీమారావు, ఎల్.సాంబమూర్తి, కె.మోహనరావు, మాజీ సర్పంచ్ కంబాల దానేసు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే సరైన గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. నువ్వలరేవు (లక్ష్మీదేవిపేట) ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేసి వేరే పాఠశాలలకు బదిలీ అయిన బి.శశిభూషణ్, ఎ.స్వాతిలను తోటి సిబ్బంది మంగళవారం దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. ప్రధానోపాధ్యాయులు జి.రాజేశ్వరరా, కె.జయరాం, మోహన్‌రావు, సుందర్‌రావు, వెంకటరావు, శ్రవంతి, కుమారస్వామి, సురేష్ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో..
అధిక దిగుబడులు

- పంట దిగుబడితో పాటు భూసారం మెండు
- యూరియా వినియోగం తగ్గించాలని సూచిస్తున్న వ్యవసాయాధికారులు



యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడితో పాటు సమయం, పెట్టుబడులు ఆదా అవుతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అంతే కాకుండా వరి సాగులో యూరియా వినియోగం తగ్గించాలని అధికారులు చెబుతున్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి..

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం ఎంటీయూ 7029, 2537, ఎంటీయూ 1121(శ్రీధృతి), 1061, 1064, 1318, ఎంటీయూ 7029(స్వర్ణ), బీపీటీ 5204(సాంబమసూరి), ఎంటీయూ 1224 రకాల విత్తనాలను సాగుకు సిద్ధం చేశారు. వీటితో పాటు నూజివీడు సంపద, అమూల్య తదితర రకాలు బయట లభ్యమవుతున్నాయి. ఎకరానికి సరాసరి సన్నరకాలు 20 నుంచి 25 కిలోలు, దుడ్డు రకం 25 నుంచి 30 కిలోల విత్తనాలు సరిపోతాయి. సేంద్రియ ఎరువులు, పశువుల గత్తం ఉపయోగిస్తే ఎంతో మంచిది. అయితే వాటిని విత్తుకునే ముందు కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజం కలిపి తడిపి ఆరబెట్టుకోవాలి. విత్తనశుద్ధి తప్పనిసరి. ఆ తర్వాత సిద్ధం చేసిన నారుమడిలో వేసుకోవాలి. జూలై ఐదో తేదీ నుంచి ఆగస్టు వరకు నాట్లు వేసుకోవచ్చు.

నారుమడి తయారీ ఇలా..

సాగులో నారుమడి ఎంతో కీలకం. నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్ట్ వేసి రెండు, మూడు సార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి. సాధారణ పంట భూమి కంటే నారుమడులను కొంచెం ఎత్తులో సిద్ధం చేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడిలో ఒకకిలో నత్రజని, రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్ గల ఎరువును దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు వేసిన 15 రోజుల తర్వాత మళ్లీ కిలో నత్రజని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో నారు ముదురు పోకుండా చూసుకోవాలి.

73 వేల ఎకరాల్లో సాగు..

టెక్కలి నియోజకవర్గంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 73 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో రైతులకు అవసరం మేరకు ఐదు వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేశారు.

యూరియా వినియోగం తగ్గించాలి



రైతులు వరి సాగులో యూరియా వినియోగం తగ్గించాలి. అలాగే యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ముందుగా వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు సేంద్రియ విధానంలో యాజమాన్య పద్ధతులతో సాగు చేయడం వలన అధిక దిగుబడులు, సమయం, డబ్బు ఆదాతో పాటు భూసారం పెరుగుతుంది. రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. – బి.వి.తిరుమలరావు, ఏడీ, వ్యవసాయ శాఖ, టెక్కలి

ట్రిపుల్ ఐటీకి పలువురు ఎంపిక



పూనా వైష్ణవి



దున్న నిరంజన్



మలిపెద్ది కృష్ణమూర్తి



మల్లేన హర్షవర్ధన్



కీలు శ్రీహర్ష

సోంపేట: సోంపేట పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసించిన పూనా వైష్ణవి, దున్న నిరంజన్, మలిపెద్ది కృష్ణమూర్తి, మల్లేన హర్షవర్ధన్, కీలు శ్రీహర్ష ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

టెక్కలి: టెక్కలి ఏపీ ఎంజేపీ బాలికల పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.సుధారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జగిలింకి నవ్య, యండ దాత్రి, చింతల జ్యోత్స్న, దూబ త్రివేణి, బోర వెన్నెల, ఆనింగి జ్యోత్స్న, సాలిన సుస్మిత, పడాల పల్లవి, జోగ కావ్య ఎంపికైన వారిలో ఉన్నారన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బత్తిని లాస్య, తామాడ అర్చన ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. వీరిద్దరూ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనట్టు కళాశాల సిబ్బంది తెలిపారు. విద్యార్థులను గ్రామ పెద్దలు బత్తిని ప్రశాంత్, మౌనిక,తామాడ ప్రదీప్, బి.బాలక్రిష్ణ అభినందించారు.

కవిటి: బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కవిటి విద్యార్థులను స్కూల్ కమిటీ చైర్మన్ తెప్పల మోహన్ అభినందించారు.



వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న గ్రామ పెద్దలు



కవిటి: అభినందనలు అందుకుంటున్న విద్యార్థులు

జీడి కార్మికుల వేతనాలు పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జీడి కార్మికులు

మందస: జీడి కార్మికుల వేతనాలు పెంచాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. మందసలో జీడి కార్మికులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. చార్టర్ ఆఫ్ డిమాండ్లను పరిష్కరించకపోతే పోరాటం ఉద్ధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహన్‌రావు అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అధ్యక్షతన జరిగిన ర్యాలీలో వారు మాట్లాడుతూ.. జీడి కార్మికులు అతితక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని, 18 నెలలు గడిచినప్పటికీ యాజమాన్యలు చార్టర్ ఆఫ్ డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ర్యాలీలో అధిక సంఖ్యలో జీడి కార్మికులు పాల్గొన్నారు.

సమాచార హక్కు సమన్వయ సంఘం ప్రతినిధుల నియామకం

టెక్కలి: సమాచార హక్కు సమన్వయ సంఘం జిల్లా ప్రతినిధుల నియామకం చేపట్టినట్లు ఉత్తరాంధ్ర అధ్యక్షురాలు కావూరి వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధ్యక్షునిగా కూన వాసుదేవరావు, ఉపాధ్యక్షునిగా దుప్పల శ్రీనివాస్, కార్యదర్శిగా కూన డిల్లేశ్వరరావు, సహాయ కార్యదర్శి, కోశాధికారిగా పల్ల అచ్యుత్‌రావు, సాయి కృష్ణలను నియమించినట్లు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

కాశీబుగ్గ: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పలాస మాజీ సర్పంచ్ కొల్లకోట నీలకంఠం ఆదివారం రాత్రి కన్నుమూశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్, కౌన్సిలర్ గురుటి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ బత్తిన హేమారావు సోమవారం నీలకంఠం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

నేడు జగన్నాథుని నేత్రోత్సవం

ఇచ్ఛాపురం: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం..ఇచ్ఛాపురంలోని జగన్నాథుని ఆలయంలో బుధవారం స్వామివారి నేత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రదీప్ కొండిపర్తి

టెక్కలి: విద్యార్థి దశ నుంచి నైతిక విలువలు, ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని సినీ నటుడు, దర్శకుడు ప్రదీప్ కొండిపర్తి సూచించారు. టెక్కలి మదర్ థెరిసా పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. తల్లిదండ్రులు వారి పిల్లలతో స్నేహంగా మెలగాలన్నారు. పిల్లల్ని అతి గారాబం కాకుండా బాధ్యతతో పెంచాలని సూచించారు. మగ, ఆడ అనే తేడా లేకుండా పిల్లలిద్దరినీ సమానంగా పెంచాలని ప్రదీప్ కోరారు. ప్రాథమిక స్థాయి నుంచి నాయకత్వ లక్షణాలు మెరుగుపరచుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపాలన్నారు. ఏకాగ్రత, లక్ష్యంతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయిలో ఉంటారని విద్యార్థులకు వివరించారు.

ఘనంగా సీతమ్మతల్లికి చల్లదనం



అమ్మతల్లి వేషధారణలో కూరగాయల రైతు లోకేష్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి.. పలాస సీతమ్మతల్లి గ్రామ దేవత చల్లదనం కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కూరగాయల రైతులు వేసిన వివిధ రకాల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం మహిళలతో ముర్రాటలు అమ్మవారికి సమర్పించారు. మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు.



సంబరాల్లో అకట్టుకుంటున్న కాళీమాత వేషదారుడు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి చల్లదనం

ఇచ్ఛాపురం: గ్రామదేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారికి భక్తులు చల్లదనం సంబరాలను మంగళవారం నిర్వహించారు. ముడియావీధి, బలరామపేటతో పాటు మరో పది వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాళీమాత వేషధారణలో కళాకారులు అలరించారు.

పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలి



విత్తనాల కిట్లను ప్రదర్శిస్తున్న సభ్యులు

మందస: స్వయం శక్తి సంఘాల సభ్యులు పెరటితోటల పెంపకంపై దృష్టిసారించాలని ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. కిచెన్ గార్డెన్స్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 11 రకాల కూరగాయల విత్తనాల కిట్లను సంఘాల సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వీవోఏలు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి..



పలాస మండలం బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. దీంతో పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారిని ఉపాధ్యాయులు అభినందించారు. సి.హెచ్.హర్షిత, జి.నిరోషా, పి.బాలక్రిష్ణ నూజివీడు క్యాంపస్‌కు, బి.హేమంత్, ఎస్.ప్రణతి శ్రీకాకుళం, ఎస్.ప్రణీత్‌సాయి ఇడుపులపాయ క్యాంపస్‌లకు ఎంపికయ్యారని.. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర పండా అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. – పలాస

డ్రగ్స్ బారిన పడొద్దు..



యువతీ, యువకులు డ్రగ్స్ బారిన పడొద్దని టెక్కలి ఎస్ఐ రఘునందనరావు సూచించారు. ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలు చేస్తే తక్షణమే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మతో పాటు బి.సతీష్‌కుమార్, ల్యాక్‌పాల్, ఈగల్ కోఆర్డినేటర్ పీవీఎస్ ఆచార్యులు, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు. – టెక్కలి

విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి..



వరి విత్తనాలను శుద్ధి చేసిన తరువాతే విత్తుకోవాలని నందిగాం మండల వ్యవసాయధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. రధ జనబొడ్డపాడు పంచాయతీ బొల్లుకోల, బెజ్జిపల్లి పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. వరి విత్తనాలను జీవ శిలీంధ్రనాశిని సూడోమొనాస్ కలిపి శుద్ధి చేయాలని సూచించారు. ఇందుకు గాను కిలో విత్తనాలకు పది గ్రాములు సూడోమొనాస్ కలిపి శుద్ధి చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు రాజేష్, లోకేష్ పాల్గొన్నారు. – నందిగాం

సచివాలయ ఉద్యోగుల నిరసన ప్రదర్శన



మందస: ఎంపీడీవోకు వినతిని అందజేస్తున్న ఉద్యోగులు



సోంపేట: ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



కవిటి: ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ సిబ్బంది

సోంపేట: తమకు సొంత మండలాల్లో విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని సోంపేట సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో సి.హెచ్.ఈశ్వరమ్మకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మెరిట్ జాబితా ప్రకారం బదీలల ప్రక్రియ నిర్వహించాలని, అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పించాలని, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు.

మందస: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. పదోన్నతులు కల్పించాలని, సొంతమండలంలో పని చేసే అవకాశం కల్పించాలని, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీవో వై.వెంకటరమణకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

కవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డికి సంఘ ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

ఘనంగా నిండు మంగళవారం పూజలు



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని గొర్లెపాడు గ్రామంలో ఆవేటి మంగళవారాలు, నిండు మంగళవారాల పేరిట ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో కొలువైన నిమ్మాసుని అమ్మవారు, పెద్దమ్మ అమ్మవారు, కాళీమాత, గంధమ్మవారు. ఊరమ్మవారు, గుసిరమ్మ తల్లి అమ్మవార్లకు ఆవేటి మంగళవారాల పేరిట పాయసన్నం, పళ్లను భక్తులు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

'మేజర్' సమస్యలను పరిష్కరించాలి

- లేదంటే దీక్ష చేస్తాం
- నిధులు ఏమవుతున్నాయి?
- టెక్కలి మండల సమావేశంలో సభ్యులు నిలదీత



మేజర్ పంచాయతీ సమస్యలపై సంబంధిత ఉద్యోగిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వాణి

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో నెలకున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. వీధి దీపాల నిర్వహణ మొదలుకొని పారిశుద్ధ్యం, విచ్చలవిడిగా కుక్కల సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రోడ్డెక్కి దీక్ష చేస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి హెచ్చరించారు. ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానంగా టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో సమస్యలపై దువ్వాడ వాణితో పాటు పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన పంచాయితీ కార్యాలయం ఉద్యోగి శశికుమార్‌పై మండి పడ్డారు. పంచాయతీలో ఎక్కడా వీధి దీపాలు వెలగడం లేదని, చెత్త నిల్వలు పేరుకుపోతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం కోసం చేస్తున్న లక్షలాది రూపాయలు ఏమవుతున్నాయని వాణి ప్రశ్నించారు. తక్షణమే పంచాయతీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ..లేకపోతే ప్రజల తరఫున రోడ్డెక్కి దీక్ష చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని కూటమి ప్రభుత్వం, నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. సాక్ష్యాత్ మంత్రి నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రంలో పరిస్థితి ఇలా ఉండడం సిగ్గు చేటుగా ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు వాణి అసహనం వ్యక్తం చేశారు. మండలంలో విత్తనాల కొరతపై ఎంపీటీసీ సభ్యురాలు సత్తారు ఉషారాణి ప్రశ్నించారు. హుద్‌హుద్ ఇళ్ల వద్ద కరెంటు సదుపాయం కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంతో పాటు వైఫల్యం చెందారని మండిపడ్డారు. ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ప్రాదేశికాలవారీగా అభివృద్ధి పనులకు ఎంపీటీసీలకు నిధులు కేటాయించాలని, అలాకాకుండా అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా మండల పరిషత్ నిధులు ఖర్చు చేస్తామంటే ఊరుకునేది లేదని వాణి హెచ్చరించారు. అనంతరం వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్, సభ్యులు పి.హేమలత, కె.పార్వతి, బి.దేవయాని, పి.దేవి, ఎస్.అప్పలరెడ్డి, జి.రాజేష్, జి.మోహన్‌రెడ్డి, ఆర్.జయమోహన్, వి.తవిటయ్య, ఎం.శంకర్, కె.కామేష్, మండల అధికారులు పాల్గొన్నారు.